




ఇసుక ట్రాక్టర్లు సీజ్



ప్రజాశక్తి-గుడ్లూరు

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఇసుక ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గుడ్లూరు గొల్లపాలేనికి చెందిన కొందరు గొల్లపాలెం దగ్గర ఉన్న మన్నేరులో ఇసుక లోడ్ చేసుకొని కావలి కందుకూరు పట్టణానికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించి వారి దగ్గర ఎలాంటి అనుమతులు లేకపోవడంతో 9 ఇసుకలోడు ట్రాక్టర్లని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ వెంకట్రావు తెలిపారు.

విఆర్‌ఒల బదిలీలకు బ్రేక్..!

రెవెన్యూ శాఖలో మల్లగుల్లాలు



ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ప్రభుత్వ శాఖల ప్రక్షాళనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనా అంశాల్లో కూటమి సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చాజెండా ఊపింది. ఉద్యోగుల బదిలీల్లో అనుసరించాల్సిన మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల మేరకు ఐదేళ్లు దాటిన ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి బదిలీ కావాల్సి ఉంది. ఈ నిబంధన మొత్తం 15 ప్రభుత్వ శాఖలకు వర్తిస్తోంది. బదిలీల ప్రక్రియలో ప్రభుత్వం నిర్ధేశించిన మార్గ దర్శకాల ప్రకారంకలెక్టర్ ఆనంద్ రాజకీయ పైరవీలు, ఒత్తిళ్లకు తలొగ్గ కుండా పార దర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు రెవెన్యూ శాఖలో జిల్లా వ్యాప్తంగా నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 750 మందిలో 9 మంది విఆర్‌ఒలను నహాయిస్తే మిగిలిన విఆర్‌ఒలను బదిలీ చేశారు. ఈ తొమ్మిది మంది విఆర్‌ఒలలో కొందరు 2015, మరి కొందరు 2019 నుంచి విధుల్లో ఉన్నారు. ప్రభుత్వం నిర్ధేశించి మార్గదర్శకాల ప్రకారం తొమ్మిది మంది విఆర్‌ఒలు బదిలీ కావాలి.వీరు ఒకే డ్రాయింగ్ అండ్ డిస్బ ర్సింగ్ ఆఫీసర్ (డిడిఒ) వద్దనే గత ఐదేళ్ల కిందట నుంచి జీతాలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఆ తొ మ్మిది మంది విఆర్‌ఒలు బదిలీ కావాలి. అయితే విధి ర్వహణలో ఐదేళ్ల కాలవ్యవధి ముగిసినప్పటికీ ఆ 9 మంది విఆర్‌ఒలను ఎందుకు బదిలీ చేయ లేదు..? అనేది ప్రస్తుతం బదిలీపై వెళ్లిన విఆర్‌ఒల బుర్రల ను తొలుస్తున్న ప్రశ్న. తహశీల్దార్ కార్యాలయాల నుంచి కలెక్టర్‌కు చేరిన బదిలీల జాబితాల్లో పొరపాటు జరిగిందా ? లేదా కింది స్థాయి ఉద్యోగులు ఉద్దేశ్యపూర్వ కంగా నే జాబితాను ఏ మార్చి కలెక్టర్ కు పంపించారా ? అనే సందేహాలు కూడా లేకపోలేదు. ఎందుకంటే రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా లెక్కచేయని కలెక్టర్‌ను ఈ తొమ్మిది మంది విఆర్ ఒల బదిలీలను ఎందుకు నిలుపుదల చేస్తారన్న అభిప్రాయం రెవన్యూ శాఖలో వ్యక్తంమవుతోంది. ఏది ఏమైనా ఆగిన ఆ తొమ్మిది మంది విఆర్‌ఓల బదిలీల ప్రక్రియ అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది.

అబ్దుల్ అజీజ్‌కు అభినందనలు

ప్రజాశక్తి -నెల్లూరు : రాష్ట్ర రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌ను నెల్లూరు హరనాధ పురం లోని ఆయన నివాసంలో పలువురు కలిసి అభినందనలు తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర టిడిపి ముదిరాజు సాధికార సమితి కన్వీనర్ పి ఎల్ రావు. నెల్లూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్రీమతి పనబాక భూలక్ష్మి,నెల్లూరు పార్లమెంట్ ఐ టిడిపి కన్వీనర్ ఏస్ కే రసూల్,గంగరాజు పి వెంగయ్య, తిరుపతి రాజు, నారా శ్రీనివాసులు నాయుడు,కష్ణ యాదవ్ మొహమ్మద్,వహీద్ ఉప్పు భాస్కర్, సాబీర్ భాష, అజారుద్దీన్ తదితరులు అబ్దుల్ అజీజ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి -విడవలూరు

ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతంర పోరాటాలు చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. సిపిఎం విడవలూరు మండలం నాలుగో మహాసభ వనపర్తి అంకయ్య అధ్యక్షతన ఆదివారం ఇక్కడ జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు మైపాటి పాపయ్య జండా ఆవిష్కరణతో మహాసభలు ప్రారంభ మయ్యాయి. అనంతరం జక్కా వెంకయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి చిత్రపటాలకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జొన్నలగడ్డ వెంకమ్మ రాజు, సీనియర్ నాయకులు కోసూరు నరసయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పిం చాచారు. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లా డుతూ అంతర్జాతీయంగా కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్న పోరాటాలు, ఎదుర్కొంటున్న ఒడిదుడ ుకులను వివరించారు. జాతీయ రాజకీయాల్లో సిపిఎం వైఖరి గురించి వివరించారు. మండల కార్యదర్శి తుళ్లూరు గోపాల్ 2021 నుండి 2024 వరకు జరిగిన కార్యక్రమాలపై కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం చర్చల్లో పాల్గొన్న సభ్యులు పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం 11 మంది మండల కమిటీ ఎన్నుకున్నారు. తలారి సురేష్‌ను ఏకగ్రీవంగా మండల కార్యదర్శిగా ఎన్నుకున్నారు.ఆ తర్వాత డిసెంబరు 7 8 తేదీల్లో జరుగు జిల్లా మహాసభలకు ఆరుగురు ప్రతి నిధులను ఎన్ను కున్నారు. మహాసభ ముగింపు ఉపన్యాసంగా జిల్లా కార్యద ర్శివర్గ సభ్యులు జొన్నలగడ్డ వెంకమ్మ రాజు మాట్లాడారు. మండ లంలోని వ్యవ సాయ రంగం పరిస్థితుపై వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం, రైతు సంఘం ఉద్యమాలు చేయాలన్నారు. ఆ దిశగా నూతన కమిటీ పని చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



తలారి సురేష్ (కార్యదర్శి)

'అపోలో' వైద్యసేవలు అభినందనీయం

ఎస్‌పి కృష్ణకాంత్ - ఆకట్టుకున్న 'వాక్‌థాన్'ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి -నెల్లూరు

పోలీసులకు వైద్య సేవల పరంగా అపోలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భరోసాగా నిలవడం హర్షించదగ్గ విషయమని ఎస్ పి కృష్ణకాంత్ అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని కెవిఆర్ సెంటర్ నుంచి పోలీసు కవాతు మైదానం వరకూ అపోలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పెద్ద ఎత్తున నిర్వహించిన వాక్ థాన్ ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సల రెడ్డి, సిటివిఎస్ సర్జన్ డాక్టర్ విజ్ఞ చరణ్, కార్డియాల జిస్టులు డాక్టర్ షర్మిలి, డాక్టర్ నాగభూషణం, ఇతర వైద్య సిబ్బంది గుండె వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాక్ థాన్ ను నిర్వహించారు. ఎస్ పి జెండా ఊపి వాక్ థాన్ ను ప్రారంభించారు. పోలీసు కవాతు మైదానం వరకూ వాక్ థాన్ సాగింది. అనంతరం పోలీసు కవాతు మైదానంలో ఎస్‌పితో కలిసి అపోలో వైద్యులు వెయ్యి హీలియం బెలూన్లు గాల్లోకి వదిలారు. అనంతరం ఎస్ పి మాట్లా డుతూ 24 గంటలూ విధుల్లో ఉండే పోలీసులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రధానంగా పోలీసులు పని ఒత్తిడిని ఎదుర్కొం టుంటారని, ఒత్తిడి వల్ల గుండె సంభందిత రోగాలు వచ్చే అవకాశముందన్నారు. పోలీసులందరూ ఏడాదిలో ఒక సారి ఫుల్ బాడీ చెక్ అప్ చేయించుకోవాలన్నారు. ఆ విషయంలో నెల్లూరు అపోలో హాస్పిటల్ సహకారం అంది స్తుందన్నారు. అపోలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ చిర్రా భక్తవత్సల రెడ్డి మాట్లాడుతూ పోలీసులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటూ నిత్యం తేలికపాటి వ్యాయా మాలు చేస్తే గుండె సంభంద సమస్యలకు దూరంగా ఉండొచ్చన్నారు. అనంతరం పోలీ సులకు ఉచితంగా గుండె సంభంద సమస్యలకు ఉచితంగా పరీక్షలను నిర్వహించారు. లో పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొని అపోలో అందించిన ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. అదనపు ఎస్ పి సౌజన్య , పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



వాక్‌థాన్ ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి, వైద్యులు

టమోట ధరలకు రెక్కలు

వినయోగదారులు లబోదిబో..

ప్రజాశక్తి-కందుకూరు

టమోటాల ధర రోజురోజుకు పెరుగుతుంది. రెండు వారాల కిందట టమాటాలు కేజీ రూ. 24ఉండగా ప్రస్తుతం కేజీ రూ. 50 చేరింది. టమాటాల ధర రోజురోజుకు పెరుగుతూ ఉండటంతో వినియోగదారులు కొనుగోలుకు వెనకాడుతున్నారు. ఇంకా ధర పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. టమాటాలతో పాటు కూరగాయల ధరలు కూడా పెరుగుతున్నాయి. మిర్చి, బెండకాయలు మాత్రమే వినియో గదారులకు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన అన్ని రకాల కూరగాయలు ధరలు ప్రజలకు అందుబాటులో లేవనే చెప్పాలి. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగడంతో ఏమి తిని ఎలా బతకాలనే అయోమయంలో ప్రజల పడ్డారు.





ఆర్థిక సాయం అందిస్తున్న నీలం నాగేంద్ర

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు

ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక సభకు వచ్చి ప్రమాదవశాత్తు మృతిచెంది జెట్టి అరిస్టాటిల్ తల్లి కల్పనకి దళిత నేత నీలం నాగేంద్రం రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు.ఈనెల 14న ఒంగోలు అంబెద్కర్ భవన్ లో జరిగిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభకు వచ్చి తిరిగి వెళ్తూ ప్రమాదవాశాత్తు అరిస్టాటిల్ మృతిచెందాడు. డిగ్రీ చదివిన జెట్టి అరిస్టాటిల్ కందుకూరు శ్రీనగర్‌కు చెందినవాడు. ఇతని తండ్రి సుబ్బారావు చాలా కాలం కిందట మరణించాడు. పెద్ద కొడుకు ఎడిషన్ నిరుద్యోగి. వీరిది చాలా పేద కుటుంబం. సామాజిక చైతన్యం కలిగిన వీరి తండ్రి సుబ్బారావు తన పిల్లలు ఇద్దరికి ఏడిసన్, అరిస్టాటిల్ అని పేరు పెట్టుకున్నాడు. ఈనెల 22న ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో జరిగిన మాలల ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక సభలో దళిత నేత నీలం నాగేంద్రం ప్రకటించిన విధంగా వారం రోజుల తర్వాత కందుకూరు వెళ్లి స్థానిక సామాజిక వేత్త అంబేద్కరిస్ట్ పి కోటేశ్వరరావు సమక్షంలో 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. సామజిక వేత్త పాలేటి కోటేశ్వరరావు మాట్లాడుతూ మాలమహానాడు పేరుతో ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్, ఎంఎల్‌సి వంటి పదవులు అనుభవించిన జూపుడి కారం శివాజీ లాంటివారు మాలల పక్షాన మాట్లాడకుండా మౌనం వహించడం సరికాదన్నారు. దళిత నాయకులు కాసుకుర్తి ఆమెన్ రాజు, కాకుమాని, మక్కెన వరకుమార్ ఉన్నారు.



దేవదాసును సన్మానిస్తున్న పసునూరి రవీంద్ర, పాటిబండ్ల ఆనందరావు

వర్ల దేవదాసుకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : మహాకవి కవి, కోకిల నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా కందుకూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు వర్ల దేవదాస్‌కి కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీంద్ర, కవి సినీ రచయిత డాక్టర్ పాడిబండ్ల ఆనందరావు చేతుల మీదగా అందజేసి సన్మానించారు వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తూ మాదిగల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్‌సి వర్గీకరణ సాధించిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరగని పోరాటం చేసి వ్యక్తిగత ప్రయోజనాలను స్వార్థ ప్రయోజనాలను పక్కకు నెట్టి తమ జాతి గెలిపే అంతిమ లక్ష్యంగా ఉద్యమించినట్లు వర్ల దేవదాసుని సన్మానించాల్సిన బాధ్యత మాదిగ సమాజంపై ఉందన్నారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు మాదిగ, కొల్లూరి భరత్ ఎడ్యుకేషన్ సొసైటీ హైదారాబాద్.ఎంఇయఫ్ జిల్లా అధ్యక్షులు కత్తి ఐజక్ , భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పెరికె లక్ష్మణ్, ఎం ఎస్ పి జిల్లా నాయకులు పూనూరి క్రిష్టాఫర్, ఎం.ఎఫ్ డివిజన్ అధ్యక్షులు జడ రాములు, ఎం.ఈ ఎఫ్ డివిజన ప్రధాన కార్యదర్శి మున్నంగి రమేష్, జాన్ పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రులు

19 మందితో ఉత్సవ కమిటీ ఏర్పాటు -ఛైర్మన్‌గా ఒట్టూరు సురేంద్ర యాదవ్

ప్రజాశక్తి -నెల్లూరు : అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రులు జరుగుతాయని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఎంఎల్‌ఎ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ శరన్నవరాత్రుల ఉత్సవాలను అత్యంత పకడ్బంధీగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకోసం 19మందితో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కమిటీ ఛైర్మన్‌గా సురేంద్ర యాదవ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. దేవస్థా నంలో శరన్నవరాత్రుల ఉత్సవా ల ఏర్పాట్లపై ఆర్.డి.ఓ. వివిధ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఆధ్మా త్మిక వాతావరణం ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీధర్‌రెడ్డి

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఉలవపాడు

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని సిపిఎం మండల కార్యదర్శి జివిబి కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కరేడు రామకష్ణాపురంలో సిపిఎం శాఖ మహాసభ జరిగింది. ఈ సభకు కత్తి సుజాత అధ్యక్షత వహించింది. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి జివిబి కుమార్, మండల కమిటీ సభ్యులు పొన్నం రామలక్ష్మమ్మ పాల్గొన్నారు. గిరిజనులు భూమి,నివాస ప్రాంత సమస్యలైన డ్రెయినేజీ, సైడ్ కాలువలు, విద్యుత్ స్తంభాలు సక్రమంగా లేకపోవడం, లైన్లు సక్రమంగా లేకపోవడం, వంటి సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని మండల కార్యదర్శి జివిబి కుమార్ పేర్కొన్నారు. తక్షణమే పంచాయతీ, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని పరిష్కారం చూపాలన్నారు. మండల సిపిఎం నాయకురాలు పొన్నం రామలక్ష్మమ్మ మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో కరేడు రామకష్ణాపురంలో అనేక సమస్యలు పోరాటం చేసి పరిష్కారం చేసుకున్నామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సిపిఎం సభ్యులు కత్తి జ్ఞానయ్య,కత్తి శివయ్య, నంబూరి నాగమ్మ, ఈసం.సురేంద్ర,చెవూరి. లోకేశ్వరరావు, మాణికల భాస్కరరావు, కత్తి జాలమ్మ, కత్తి వెంకాయమ్మ, కత్తి. చెంచమ్మ, తో పాటు కెవిపిఎస్ గంజి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యదర్శి నివేదికను కత్తి. సుజాత ప్రవేశ పెట్టగా సభ్యులు అందరూ చర్చించారు.



మాట్లాడుతున్న నాయకులు

నూతన కమిటీ లు ఎన్నిక

అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కరేడు రామకష్ణాపురం నూతన శాఖా కార్యదర్శులుగా కత్తి సుజాత, చేవూరి లోకేశ్వరరావును ఏకగ్రీవంగా ఎనున్నకున్నారు.



కత్తి సుజాత (కార్యదర్శి)



చేవూరి లోకేష్ (కార్యదర్శి)

శ్రీనివాసులురెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి -నెల్లూరు

జిల్లాలోని రాపూరు మండలంలో వెలిసిఉన్న పెనుశిల శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా భాద్యతలు చేపట్టిన పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని అవెన్యూస్ స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కష్ణా చైతన్య, వర్ధనరెడ్డి, కాలేజ్ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, స్టార్ డెంటల్ అధినేత డాక్టర్ హరికిషన్ రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు అభినందనలు తెలిపారు.



శ్రీనివాసులురెడ్డికి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -నెల్లూరు

31వ డివిజన్, టైలర్స్ కాలనీకి చెందిన వైసిపి ముస్లిం మైనార్టీ కార్యదర్శి నాయబ్ రసూల్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. తనకు ఓటు వేయనివారు, నాకువ్యతిరేకంగా చేసినవాళ్లకు కూడా ఏమైనా సమస్యలు ఉంటే మీరు స్వేచ్ఛగా తన దగ్గరకు వచ్చి పనులు చేయించుకోవాలని ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి మన్నేపల్లి రఘు, టీడీపీ నాయకులు పల్నాటి మస్తాన్ నాయుడు,ఖాదర్ భాషా టి.వి.ఎస్. కమల్, రెహ్మత్, సతీష్, కమాలుద్దీన్, సత్తాజ్, మస్తాన్, ఖాజా, హనీఫ్, కరీమ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి హఠాన్మరణం

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు మండలం, పొట్లూరు సచివాలయ పంచాయితీ కార్యదర్శి పాలకుర్తి ప్రసాదు (42) గుండెపోటుతో మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. మహదేవపురానికి చెందిన ప్రసాదు గుడ్లూరు మండలం. పోట్లూరు సచివాలయం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో శనివారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లారు. ఆదివారం ఉదయం గుండె పోటు రావడంతో బంధువులు ఆస్పత్రికి తరలించేలోగా మతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సహచర ఉద్యోగులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు మండలం, అడవి రాజుపాలెం నుంచి గుడ్లూరు వస్తున్న ప్రయాణికులు ఆటోని కర్ర లోడ్ తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అడవిరాజుపాలెం చెందిన ఓ యువకుడు కాలు తెగి పక్కన పడిపోయింది. బాధితులను 108 అంబులెన్స్ ద్వారా కావలికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. వైద్యులు సలహా మేరకు చెన్నైకి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.





విరాళాలు సేకరిస్తున్న నాయకులు

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ఇందుకూరుపేట

డిసెంబర్ 7,8 తేదీల్లో జరిగే సిపిఎం 25వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఇందుకూరుపేట మండల సీఐటియు అధ్యక్షులు ఎస్కే చాన్ బాషా కోరారు. ఆదివారం మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని జంగందొరువు గ్రామంలో ఆటో యూనియన్ సభ్యులతో కలిసి ఇంటింటా విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విరివిగా విరాలు అందించి ప్రజా ఉద్యమాలకు తోడ్పడాలని తెలిపారు.సిపిఎం నిరంతరం ప్రజా సమస్యల పై ఉద్యమాలు చేస్తుందన్నారు. మండలంలోని అనేక ప్రజా సమస్యలపై సిపిఎం తమ గళం వినిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు దయాసాగర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు

సిపిఎం శాఖా మహాసభలు



ప్రజాశక్తి-నెల్లూరు: స్థానిక వేదాయ పాళెం ప్రాంతంలోని రూరల్ సిపిఎం కార్యాలయం (మస్సూర్‌భవన్)లో రూరల్ ఆర్‌టిసి ఆటో శాఖ నాలుగో మహాసభ ఆదివారం నిర్వహించారు. ఆర్‌టిసి ఆటోస్టాండ్ నాయకులు కందల శ్యాంసన్ అధ్యక్షతన ఈ మహాసభ నిర్వహించారు. ముందుగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి గడచిన మూడు సంవత్సరాలుగా శాఖ చేసిన పోరాటాలకు సంబంధించిన నివేదికను శాఖ కార్యదర్శి వెంకి ప్రవేశపెట్టారు. అనంతరం మహాసభలో ప్రభుత్వం వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేయడం వంటివి పనులను ప్రయివేటే ఏజెన్సీలకు అప్పగించారని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే విధంగా ప్రభుత్వంపై కార్మిక సంఘాలు వత్తిడి తీసుకురావాలన్నారు, ఆటో కార్మికులను ప్రభుత్వం నివాస స్థలాలు కేటాయించే విధంగా, ఎన్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం వాహనాలు కొనుగోలు చేసుకొనేందుకు సబ్సిడీ రుణాలు అందజేసే విధంగా పోరాటాలకు శ్రీకారం చుట్టాలని తీర్మానం చేశారు. ఈ మహాసభలో సభ్యులందరూ ఆటోశాఖ నూతన కార్యదర్శిగా కందల శ్యాంసన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోహనరావు, వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కొండ ప్రసాద్, మల్ల సుధాకర్, దేవతాటి సంపత్, వెంకీ, లవన్, సుధా, దాను, సుకుమార్, జనార్దన్, రవీంద్ర, రత్నం పాల్గొన్నారు.

31వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శిగా సుధాకర్



భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు 31 డివిజన్ శాఖ నాలుగో మహాసభ ఆదివారం రామకోటయ్య నగర్ గవర్నమెంట్ స్కూల్లో గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన కార్యదర్శిగా మళ్ల సుధాకర్‌ను శాఖ సభ్యులు ఎన్నుకున్నారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కొండ ప్రసాద్, కిన్నెరకుమార్ ఈ మహా సభకు పర్యవేక్షకులుగా హాజరయ్యారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేసేలా, రూపాదారులకు మనుమత్తులు చేపట్టేలా, దోమల నివారణకు చర్యలు తీసుకునే విధంగా, సమ్మర్ స్టోరేజీలో మరమ్మతుల గురించి మిషన్లను బాగు చేసేలా జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని శాఖ సభ్యులు తీర్మానం చేశారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు బి.నాగేశ్వర్ రెడ్డి, పార్టీ సభ్యులు ఎస్ కె రహీం, మాదాను ముత్యాలు, జబ్బరీభాయ్, మున్వర్ భాయ్, సుభాని, జి మల్లికార్జున, రమణారెడ్డి, మా బాషా, గంగాధర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చర్చా వేదిక



ప్రజాశక్తి-కావలి: జమాయతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో "నైతికతేనిజమైన స్వేచ్ఛ" మసునూరు మదర్సాలో ఆదివారం చర్చ గోష్టి నిర్వహించారు. ప్రపంచ శాంతి ధర్మపరిరక్షణ ధ్యేయంతో 'జమాయతే ఇస్లామి హింద్' జాతీయ సంస్థ పిలుపునివ్వడం విధిత పాఠశాలలు, కళాశాలలు, వీధి కూడళ్ళు, సంస్థలతో నిర్వహిస్తూ వస్తున్న "నైతికతే నిజమైన స్వేచ్ఛ" అంశంపై మహిళా సంఘం నాయకులతో చర్చగోష్టి జమాత్ ఇస్లామి హింద్ మహిళా విభాగం స్థానిక కన్వీనర్ ఫాతిమా సదస్సును నడిపించారు. కావలి ఉమెన్స్ ఫోర్స్ కన్వీనర్ చాకలికొండ.శారద పాల్గొని మాట్లాడారు. స్వేచ్ఛ అనేది మనిషి చాలా అవసరమని, కానీ ఆ స్వేచ్ఛ ఎదుటి వారికి భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. రాజ్యాంగం గాంధీ జయంతిని గుర్తు తెచ్చుకొని గాంధీజీ చెప్పిన మాట ప్రకారం ఎప్పుడైతే ఆడవాళ్ళు అర్ధరాత్రి ఒంటరిగా నడవగలుగుతారో అప్పుడే స్వాతంత్ర్యం వచ్చినట్లు అని అన్నారు. అలా జరగాలంటే సమాజంలో ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో ప్రవర్తించాలన్నారు. హిందూ-ముస్లిం సఖ్యతను కలిగి ఉండాలని చేసిన నైతికతా సూత్రం దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించేలా చేసిందన్నారు. నైతికతను అలవరచుకోవాలని, అప్పుడే ఉత్తమ పౌరులు కాగలరని పిలుపునిచ్చారు. ఫాతిమా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మనం చేసే పనిని రోజు ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఉండాలన్నారు. అప్పుడే మనలో మంచి-చెడు తెలుసుకొని నైతిక విలువలను పెంపొందించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో స్వాతి, సుజాతలతో పాటు సంస్థల్లోని కార్యకర్తలు హబీబా, షకీలా, ఆయేషా, షాహీనా, హుమేరా, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'మంచి మాట'



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: తెలుగు భాషా సేవాసమితి వారి ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే 'మంచి మాట' కార్యక్రమాన్ని ఆదివారం ఆత్మకూరు స్థానిక గ్రంథాలయ ప్రాంగణంలోని తెలుగు భాషా సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త రామయ్యస్వామి సుదీర్ఘంగా ఉపన్యసించారు. ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే మనసుపై నియంత్రణ తప్పనిసరి అని గీతా సూక్తి అని, పని చేసేటప్పుడు మీ మనస్సును ఎల్లప్పుడూ ప్రశాంతంగా, స్థిరంగా ఉంచుకోవాలని, కోపం మనస్సును నాశనం చేస్తుందన్నారు. ఇది ఇప్పటికే చేసిన పనిని కూడా పాడు చేస్తుందని తెలిపారు. కాబట్టి మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రయత్నించాలని తెలిపారు. తెలుగు భాషా సేవాసమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బారాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెద వేంకటరెడ్డి, గౌరవాధ్యక్షులు అంకినపల్లి గోవింద రెడ్డి, సహాధ్యక్షులు కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు ఎస్ వి రమణయ్య, ఎస్.యానాది రెడ్డి, కె వి శేషారెడ్డి, వి.నారాయణ రావు, ఆర్థిక కార్యదర్శి ఒమ్మిన సుబ్రమణ్యం, సహా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్బయ్య, నరసింహారెడ్డి, ఓంకారం రావు, రామచంద్ర రావు, పెంచలరెడ్డి, ప్రచార కార్యదర్శి కలికొట్టి రవీంద్ర కుమార్, శివానందరెడ్డి, రామమోహన్ రెడ్డి, సురేష్, ఆర్ వి రెడ్డి, వెంకయ్య, మస్తాన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని మంచాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన మస్తాన్ దంపతులను శాలువా మండల యుటిఎఫ్ నాయకులు శాలువా పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని, ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చాయన్నారు. గత 26 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిని నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో నిర్వర్తించి ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని కొనియాడారు. అలాగే 15 సంవత్సరాలుగా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, యుటిఎఫ్ శాఖ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



ప్రజాశక్తి-కావలి : డి.ఆర్. విశ్వోదయ సేవాసమితి వారితో స్థానిక నవవికాస్ సెంటర్లో ఆదివారం 65మంది వృద్ధులకు రూ.65వేల విలువైన బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదును ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ బత్తిన నరేంద్ర, డాక్టర్ గొట్టిపాటి అమూల్యాదేవి దంపతులు పాల్గొని, డి.ఆర్. సేవాసమితి చేస్తున్న సేవలను కొనియాడారు. వారిచేతుల మీదుగా ఈ పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి వృద్ధులకు తాము ఉచితంగా వైద్య పరీక్షలను చేసి, ఉచితంగా మందులను కూడా అందజేయగలమని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వోదయ పూర్వ విద్యార్థి సయ్యద్ అన్వర్ తనతండ్రి సయ్యద్ మస్తాన్ జ్ఞాపకార్థం డి.ఆర్. సేవాసమితి సభ్యులుకు, వృద్ధులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. విశ్వోదయ పూర్వ విద్యార్థులు జొన్నలగడ్డ మురళీకృష్ణ, జొన్నలగడ్డ రాజశేఖర్‌లు తమ తండ్రి జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వృద్ధులకు దుప్పట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, డి.ఆర్. సేవా సమితి ఛైర్మన్ దొడ్ల ఆదిలక్ష్మి, సభ్యులు నల్లూరి రామకృష్ణ ప్రసాద్, సతీష్ సింగ్, రంగనాయకులు, జవహర్ భారతి, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

ముగిసిన గంధమహోత్సవం

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ షా మస్కూర్ అలీషా ఖాదరి గంధ మహోత్సవం మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించారు. 3వ రోజు ఉదయం తహలీల్ ఫాతెహా కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివారం ముగిసింది. తహలిల్ ఫాతెహా ఖానిలో మష్ కూర్ బాబా దర్గా పిఠాధిపతులు గురువర్యులు శ్రీ హజరత్ సయ్యద్ షా సాని సాహెబ్ ఖిబ్ల, హజ్రత్ సయ్యద్ షా మజిద్ అలిషా ఖాదరి సాహెబ్, భక్తులు, శిష్యులు అందరి కొరకు ప్రత్యేక ప్రార్థనలు దువా చేశారు. మహోత్సవానికి వచ్చిన భక్తులకు, శిష్యులకు ధన్యావాదాలు తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య



ముఖాముఖి

ప్రజాశక్తి-నెల్లూరు

జన్మనిచ్చే బిడ్డ ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, అవసరమైన మేరకు చికిత్సలు చేసుకొనే నిమిత్తం వైద్యులు గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసుకోవాలని సూచించడం సర్వసాధారణం. అయితే పరీక్షలు చేసే సమయంలో స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నుంచి తాము జన్మనిచ్చేది ఆడ బిడ్డా, మగ బిడ్డా అన్న సమాచారం తెలుసుకొని తాము జన్మనిచ్చేది ఆడ బిడ్డ అని తెలిస్తే గర్భంలోనే చంపేస్తూ అత్యంత దారుణానికి పాల్పడుతు న్నారు. ఈ విధంగా చేయడం వల్ల సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. ఈ దారుణాన్ని, దుర్మార్గపు చర్యలను నిలువరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1994 గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని రూపొందించి. జిల్లాలో ఈ చట్టం అమలు తీరు ఏలా ఉన్నది. చట్టాన్ని అతిక్రమించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో డిఎంహెచ్ఒ డాక్టరు ఎం.పెంచలయ్య మాటల్లో...

ప్రశ్న. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం సక్రమంగా అమలు జరుగుతుందా.. స్కానింగ్ కేంద్రాలు ఈ చట్టాన్ని అతిక్రమిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై మీ స్పందన ఏమిటీ..?

జవాబు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నియమనిబంధనల మేరకు (పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం) గర్భిణులకు పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో పిసి అండ్ పిఎన్‌డిఇ యాక్టు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ప్రజలకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలి. వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం.. అన్న ఫ్లెక్సీని స్కానింగ్ కేంద్రంలో అమర్చాలి. స్కానింగ్ కేంద్రాలకు పరీక్షల నిమిత్తం వచ్చే వారికి అందజేసే రిపోర్టు కాగితంపై విధిగా లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని ముద్రించి ఉండాలి. స్కానింగ్ కేంద్రాల్లో వినియోగిస్తున్న పరికరాలకు సంబంధించిన కంపెనీ వివరాలు జిల్లా కేంద్రాలకు అందజేసి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ తీసుకోవాల్సి ఉంటుంది. స్కానింగ్ కేంద్రాలల్లో గర్భిణులకు పరీక్షలు నిర్వహించే సమయంలో వారికి సంబంధించిన పూర్తి వివరాలతో పూరించిన ఫానం-ఎఫ్ ప్రతి నెలా 2వ తేదిలోగా జిల్లా కేంద్రానికి అందజేయడంతోపాటు రెండు సంవత్సరాల పాటు స్కానింగ్ కేంద్రాలల్లో భద్రపరచాల్సి ఉంటుంది.

ప్రశ్న. స్కానింగ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా.. తనిఖీలు నిర్వహించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు. అధికారులను ఏమైనా నియమించారా..?

జవాబు. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి అండ్ పిఎన్‌డిటి) పకడ్బంధీగా అమలు చేయడానికి జిల్లాలోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేయడానికి జిల్లాస్థాయి, ప్రోగ్రామ్ ఆఫీసర్స్‌ను 10 మందిని నియమించాం. ఈ అధికారులు జిల్లాలో వారికి కేటాయించిన స్కాన్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేసి పది రోజులకు ఒక నివేదిక జిల్లా కేంద్రానికి అందజేస్తారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పిసి అండ్ పిఎన్‌డిటి చట్ట పరిధిలో వారి కేంద్రాలను నిర్వహించుకోవాల్సిందిగా, చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వస్తే తీవ్రమైన చర్యలు తప్పని సరిగా తీసుకుంటాం. స్కానింగ్ కేంద్రాల్లో పిసి అండ్ పిఎన్‌డిటి చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు పక్కా ఆధారాలు అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. తాము ఆకస్మిక తనిఖీలు చేసి చట్టాన్ని అతిక్రమిస్తున్నట్లు తాము గుర్తిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణల కోసం స్కానింగ్ దుర్వినియోగం కాకుండా నివారించేందుకు జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నిశితమైన నిఘా, పర్యవేక్షణలు కొనసాగించాలని సిబ్బందికి సూచనలు చేశాం.

ప్రశ్న. జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఎవరైనా పిసి అండ్ పిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘించినట్లు కేసులు నమోదు చేశారా.. వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు. జరిమానా ఎంత మేరకు విధిస్తారు..?

జవాబు. ఇప్పటి వరకు జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పిసి అండ్ పిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘించినట్లు కేసులు నమోదు కాలేదు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఈ చట్టంలోని నిబంధనలు మొదటి సారి ఉల్లంఘించిన వైద్యులు / నిపుణులు / ఇతరులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించబడుతుంది. తదువరి ఉల్లంఘనకు రూ.50వేల జరిమానాతోపాటు ఐదేళ్ల జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుంది. అంతే కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగినా, అడగమని ప్రోత్సహించినా, చెప్పిన వారికి మొదటి తప్పుకు చట్టప్రకారం 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధించబడుతుంది. ఇదే నేరం రెండోసారి చేసినట్లైతే 5 సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించబడుతుంది. ఈ నేరాన్ని మొట్టమొదటి సారిగా ఎవరైనా డాక్టరు చేసినట్లు రుజువైతే పై పేర్కొన్న శిక్షలతోపాటు వారి వైద్య పట్టా భారత వైద్య మండలి నుంచి 5 సంవత్సరాలు సస్పెండ్ చేస్తారని, తిరిగి మరలా రెండవ సారి అదే నేరానికి పాల్పడితే శిక్షలతోపాటు వైద్య పట్టా పూర్తిగా రద్దు చేయబడుతుంది.



బోధనోపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

కస్తేరిమిట్టలోని 'మీకోసం' స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహణలో ఉన్న ఫ్రెస్ట్ హోమ్‌లో మున్సిపాలిటీలో పనిచేస్తున్న శ్రీకాంత్ తన కుమారుడు అద్వైత్ సుహాస్ నందన్ 4వ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఫ్రెస్ట్ హోమ్ విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ, బ్లాంకెట్స్, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు దిలీప్ కుమార్ రాయపాటి మాట్లాడుతూ అద్వైత్ జయంతి పుట్టిన రోజులు ఇలాంటి జరుపుకోవాలని, మంచి జ్ఞానాన్ని సాధించి, ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. అనేక రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించాలని పలికారు. శ్రీకాంత్ సమాజంపై సహృదయం కలిగి అనేక సేవా కార్యక్రమాలు చేసి అనేక మందికి స్ఫూర్తిగా నిలబడ్డాడని తెలిపారు. తన కుమారుడి పుట్టినరోజును వృథా ఖర్చులు చేయకుండా ఫ్రెస్ట్ హోమ్ విద్యార్థులకు మంచి హృదయంతో వారికి కావాల్సినవి తెచ్చినందుకు, మధ్యాహ్నపూటలో ఉన్న వారి 'సైని హట్ డాబా' హోటల్‌లో పిల్లలందరికీ బిర్యానీ పెట్టించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ సభ్యులు ఎం ఎ రవికుమార్, డేనియల్ బాబ్జీ మాట్లాడుతూ శ్రీకాంత్ కుమారుడు అద్వైత్‌కు ఈ భాకాంక్షలు తెలియజేస్తూ మీకోసం సంస్థకు సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీకాంత్, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ వంశీ, సంస్థ డైరెక్టర్ ఎం ఏ రవికుమార్, కో-ఆర్డినేటర్ డేనియల్ బాబ్జి, కృష్ణపల్లవి, శ్రీవల్లి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం గౌస్‌కు సన్మానం



ప్రజాశకి-ఉదయగిరి

ఉదయగిరి మెయిన్ స్కూల్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహమ్మద్ గౌస్‌కు పిల్లలంటే మక్కువ ఎక్కువని ఎంఇఒ షేక్.మస్తాన్ వలీ కొనియాడారు. ఆదివారం స్థానిక మెయిన్ స్కూల్లో గౌస్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మాన సభలో ఆయనతోపాటు ఉదయగిరి ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పాల్గొని ఇదే అభిప్రాయం వ్యక్త పరిచారు. తాను పాఠశాల సందర్శన సమయంలో ప్రధానోపాధ్యాయుని చుట్టూ పిల్లలు గుమికూడి ఉండే వారని, పిల్లలతో అతని అనుబంధం అలాంటిదన్నారు. మండల విద్యాశాఖ తరపున గౌస్‌ను వారు శాలువా పూలమాలలతో సన్మానించారు. ఇద్దరు ఎంఇఒలతోపాటు సిఆర్‌పిలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమంలో జెడ్‌పి కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు కె.చంద్రశేఖర్ రెడ్డి, ఎపిటిఎఫ్ నాయకులు సత్తెనపల్లి ఓబులేసు, ఖాజా, శివకోటరెడ్డి, మాజీ మండల విద్యాశాఖ అధికారులు అల్లాభక్షు, ఓబులు రెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు దస్తగిరి అహమద్, దాసరిపల్లి సర్పంచి గౌస్ మొహిద్దీన్, బంధుమిత్రులు సన్మానసభలో పాల్గొని గౌస్‌ను సన్మానించారు.

వైసిపి అక్రమాలపై మాలేపాటి ధ్వజం

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న సుబ్బానాయుడు

గత ప్రభుత్వంలో జరిగిన వైసిపి అక్రమాలపై, తిరుమల లడ్డు ప్రసాదంలో జరిగిన అవినీతిపై రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు ధ్వజమెత్తారు. కావలిలోని వారి కార్యాలయంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్రతో కలిసి ఆదివారం పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూ తిరుమల లడ్డు ప్రసాదంలో జరిగిన అవినీతిపై ధ్వజమెత్తారు. వైసిపి నేతల అధికార దాహానికి అవధులు లేకుండా పోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అంటే పనిచేసే ప్రభుత్వమని, ఈ వందరోజుల పాలనలో దానికి నిర్వచనం చెప్పామని, అదే వైసిపి ప్రభుత్వం పర్సెంటేజీల ప్రభుత్వమని మండిపడ్డారు. వైసిపి వారు టిడిపిలోకి ఏ విధంగా చేరాలి అనే ఆలోచనతో నిరంతరం టిడిపి వారి చుట్టూ తిరుగుతున్నారని, వైసిపి వారికి టిడిపిలో ఏం పని ఉందంటూ ప్రశ్నించారు. ఎప్పటికైనా మాలేపాటి అంటే టిడిపి అని, అందులో ఎటువంటి తారతమ్యం ఉండదని, ఇక్కడ పార్టీ భేదాలు ఉండవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఎంఇఒ తనిఖీలు



పరిశీలిస్తున్న ఎంఇఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మోడల్ టెట్ పరీక్షల ను ఎంఇఒ-2 తోట శ్రీని వాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు 40మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ టెట్ మోడల్ టెస్ట్‌ను యుటిఎఫ్ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇటువంటి పరీక్షలు ఈ ప్రాంతం వాసులకు అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.




ఆర్‌డిఒను సన్మానిస్తున్న సిబ్బంది

బదిలీ ఆర్‌డిఒకు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు డివిజన్ ఆర్‌డిఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఆర్‌డిఒ మధులతకు ఆదివారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఘన సత్కారం చేశారు. అన్ని మండలాల తహశీల్దార్లు కార్యాలయ సిబ్బంది పట్టణ ప్రజలు ఈ కార్యక్రమంలో హాజరై ఆర్‌డిఒ సేవలను కొనియాడుతూ వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్‌డిఒ మధులత మాట్లాడుతూ తాను ఏడాదిపాటు నిర్వహించిన ఉద్యోగ బాధ్యత ఎంతో సంతోషంగా ఉందని, ఆత్మకూరు ప్రాంత ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని తెలియజేశారు. కార్యక్రమంలో మండలాల తహశీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు చైతన్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



డిపాజిట్ నగదును అందజేస్తున్న నాయకులు

మహిళలు చైతన్యంతో ముందుకు సాగాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలోని పద్మావతి కళ్యాణ మండపంలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుచ్చి ప్రాంతీయ మండలాలు జిల్లా మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు మరింత చైతన్యంతో ముందుకు వెళ్లాలని, ఉద్యమాలలో చురుకుగా పాల్గొనాలని మూఢనమ్మకాలను ఎదుర్కోవడంలో కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం 33శాతం ఉద్యోగాలు సాధించుకొని 50శాతం మహిళలు రాణిస్తున్నారని ఆమె తెలిపారు. జిల్లా కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ సమాజంలో మహిళలు ముందుకు ఎప్పుడు వెళ్తారో సమాజం అప్పుడు అభివృద్ధి చెందుతుందన్నారు. సమాజంలో అనాదిగా స్త్రీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం కొన్ని రోజుల క్రితం మండలంలోని రేబాల గ్రామంలో అమ్మవారితోపు పాఠశాల నాడు-నేడు పనుల్లో కరెంట్ షాక్ తగిలి మరణించిన కూలి భార్యకు యుటిఎఫ్ స్థానిక మండల శాఖ తరపున రూ.72వేల నగదును వారి పిల్లల పేర్ల మీద ఫిక్సిడ్ డిపాజిట్ చేసి అందించామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.వి.శేషులు, జి వి చలపతి శర్మ, జిల్లా కార్యదర్శులు కె.నాగిరెడ్డి, కె.వి.శ్రావణ్ కుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, తదితరులున్నారు.

చిరస్మరణీయులు జాషువా



బహుమతులు అందుకున్న విజేతలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

సామాజిక అసమానతలు, అంటరానితనంపై అక్షర ప్రవాహంతో అలుపెరగని పోరాటం చేసిన గుర్రం జాషువా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని సామాజిక సమరసత వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు మోవిడి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కవికోకిల, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. తన కవిత్వంతో సమాజాన్ని అభ్యుదయ మార్గంలో నడిపిన గుర్రం జాషువా పద్యాలను ప్రతి విద్యార్థి తప్పక అధ్యయనం చేయాలన్నారు. ఫిరదౌసి, గబ్బిలం, క్రీస్తుచరిత్ర, ముంతాజ్ మహల్ రచనలతో సాహితీ ప్రియుల హృదయాలలో నిలిచిపోయారన్నారు. గుర్రం జాషువా ఆశించిన సామాజిక సమానత్వం సాకారమైనప్పుడే నిజమైన నివాళి అన్నారు. విద్యార్థులకు జాషువా పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్, బుచ్చి మండల గౌరవ అధ్యక్షులు పి.రమణయ్య, అధ్యక్షులు టి.నరసింహమూర్తి, కార్యదర్శి గండికోట సుధీర్‌కుమార్, ఇనుగూరు సుబ్బారావు, ఉపాధ్యాయులు సిహెచ్ వెంకట నారాయణ, బి.యానాదయ్య, కొండయ్య, జి.నాగభూషణం, కె.శ్రీనివాసులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సిఎంపై విమర్శలు తగవు

ప్రజాశక్తి-బిట్రగుంట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి వైసిపి నాయకులది కాదని మండల టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల టిడిపి కార్యాలయంలో ఆదివారం కూటమి నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. టిడిపి నాయకులు ఎల్.సుధీర్‌బాబు, చిలకపాటి వెంకటేశ్వర్లు, తిరుమలేష్, అరుణ, పైడి హర్ష, బిజెపి నాయకులు నూకసాని శ్రీనివాసులు, జనసేన నాయకులు వెంకటేశ్వర్లు, సురేష్ మాట్లాడారు. అనంతరం సిఎం, డిప్యూటీ సిఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు బిట్రగుంట ఎస్ఐ బోజ్యకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



మండలంలోని జొన్నవాడలో వెలసియున్న శ్రీ మల్లికార్జున స్వామి సమేతా కామాక్షితాయి దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి జరిగే శరన్నవరాత్రుల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీ కలిసస్థాపనతో మొదలై 11వ తేదీన మహిషాసుర మర్ధిని, 12వ తేదీన విజయదశమి కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, వేదపండితులు, సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.



జనసేన నాయకులు పాదయాత్ర

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి నైవేద్యంగా సమర్పించే లడ్డు ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడిన దానికి నిరసనగా ఆదివారం మహా పాదయాత్ర కార్యక్రమం ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆత్మకూరు నుండి సంగం వరకు సుమారు 25 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి అనంతరం శివాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చేసిన తప్పును ఒప్పుకొని క్షమాభిక్ష కోరాల్సిన వైసిపి నాయకులు ఎదురుదాడి చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని జనసేన నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-కోవూరు

ఇంటి ముందు పార్క్ చేసిన బైకులను దొంగతనం చేసే ముగ్గురు నిందితులను ఎట్టకేలకు ఆదివారం కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం సమీపంలో ఉన్న ఎంప్లాయిస్ కాలనీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.12 లక్షలు విలువ చేసే 15 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ డిఎస్‌పి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కోవూరు మండలం చిన్నపడుగుపాడు పంచాయతీ పరిధిలోని బందారుమాన్యంలో నివాసం ఉండే కె.రవి, సత్యవతి నగర్‌లో కాపురం ఉండే సయ్యద్ రఫీ అనే వారు తమ ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని కోవూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఎస్‌పి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు.. తన సూచనలతో కోవూరు సిఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రంగనాథ్ గౌడ్ క్రైమ్ పార్టీ సిసిఎస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కోవూరులోని శాంతినగర్‌కు సంబంధించిన గందంశెట్టి రవీంద్ర, పెళ్లకూరు కాలనీకి చెందిన షేక్.కరిముల్లా నాగరాజులు ఇంటి బయట పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిళ్లను చోరీ చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. వీరు ముగ్గురు మోటార్ సైకిళ్ల దొంగతనం చేసి వాటి నెంబర్లను, అనవాలను తారుమారు చేసి కుదువ పెట్టడం, విక్రయాలు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోతిరెడ్డిపాలెం సమీపంలో ఉన్న పాడుబడిన ఎంప్లాయిస్ కాలనీ ప్రాంతంలో నిందితులు ముగ్గురు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని వారు ఇచ్చిన సమాచారం మేరకు నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనం చేసిన మొత్తం 15 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో సిఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



ఎఫ్ఆర్ఒకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రకాశం జిల్లా కనిగిరికి బదిలీపై వెళుతున్న ఉదయగిరి అటవీ శాఖ అధికారి ఉమామహేశ్వర రెడ్డికి ఘనంగా అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం నెల్లూరులోని నగరవణంలో జిల్లా అటవీశాఖ సిబ్బంది ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డిఎఫ్ఒ, ఉదయగిరి డిఎఫ్ఒకు జిల్లా డివిజన్ సహ ఉద్యోగులు ఎఫ్ఆర్ఒలు సిబ్బంది ఘనంగా పూల మాలలు శాలవాలతో సత్కరించి వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ అధికారికి బదిలీలు సర్వసాధారణమని అందులో భాగంగా ఇరువురు బదిలీపై వెళ్లడం సంతోషదాయకమన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అందించిన సహాయక సహకారాలు గుర్తించుకోగలమని సిబ్బంది తమ వృత్తిని పవిత్రంగా భావించినప్పుడే పదోన్నతలు వరిస్తాయని ప్రతిఒక్కరూ తమ తమ విధులను ప్రజలకు అందుబాటులో అటవీ సంపదను రక్షించుకోవాలన్నారు.

1న చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వింజమూరు

మండల కేంద్రమైన వింజమూరులో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు వింజమూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మండలస్థాయిలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కావున మండలంలోని పాఠశాల స్థాయిలో గెలుపొందిన వారు మండల స్థాయిలో పాల్గొని బహుమతుల పొంది, జిల్లాస్థాయి పోటీలకు పాల్గొనడానికి సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు జి.కామాక్షయ్య, జి.చెంచుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి



ప్రజాశక్తి-జలదంకి : సమాజంలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సమాజంలో వాయు కాలుష్యం, ధ్వనికాలుష్యం, జల కాలుష్యం పెరిగి ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పౌరు సమాజం అడవులను కాపాడుకొని విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షించుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయిందని, ఎవరూ వీధుల్లో కూడా మొక్కలు నాటడం లేదని, తద్వారా కార్బన్ డయాక్సైడ్ పెరిగి ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. దాని కోసం పౌర సంఘాలు, అధికారులు నిరంతరం ప్రజలలో అవగాహన పెంచి పర్యావరణ పరిరక్షణకు మనందరం కృషి చేసి పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆకాంక్షను తెలియజేశారు.